

కథా కౌముది

సాధన తార — శ్రీపతి లలిత

"అపర్ణా! రేపు మనం శ్రేయస్ కుటుంబాన్ని కలవాలి గుర్తుందా!"

కుసుమ వేపు విసుగ్గా చూసి, "అబ్బా! ఎన్నిసార్లు చెప్తావమ్మా! ముందు, నేను ఆ అబ్బాయిని కలిసి మాట్లాడతాను అంటే వినవు. ఎక్కడో బీసీ నాటి కాలంలో ఉన్నావు. ఇలా అందరు పెద్దవాళ్ళ మధ్య, మేమేం ఫ్రీ గా మాట్లాడుకుంటాం! అర్థం చేసుకోవు!" అంది అపర్ణ.

"ఫ్రీగా ఏం మాట్లాడతావు? నాకు వంట రాదు. రోజూ బయట నుంచి ఆర్డర్ చేస్తాననా? రాత్రి ఒంటిగంట దాకా మేలుకుని పొద్దున్న పదింటికి లేస్తాననా?" తల్లి మాటలకి కోపం వచ్చింది అపర్ణకి.

"నేను సినిమాలు, షికార్ల కోసం, ఒంటి గంటదాకా మేలుకుంటున్నానా? నా ఆఫీస్ పని వేళలు అలా ఉన్నాయి. రోజూ రాత్రి పదింటినుంచి మీటింగ్స్ ఉంటాయి. అవి అయ్యాక నాకు పని ముగించి పడుకునేసరికి, ఒంటిగంట అవుతుంది. కనీసం ఒక ఎనిమిది గంటలు నిద్ర పోవాలి కదా! పాత సినిమాల్లో చూపించినట్లు పొద్దున్నే లేచి తలస్నానం చేసి, మడిచీర కట్టుకుని, తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణలు, హారతిలిస్తూ నా వల్ల కాదు. పేరొందిన కాలేజ్ నుంచి కంప్యూటర్స్ ఇంజినీరింగ్ చేసాను. క్యాంపస్ నుంచి పెద్ద ఎంఎన్సీ లో ఉద్యోగం. ఈ వయస్సులో ఎవరూ ఊహించలేని జీతం. రేపోమాపో ప్రాజెక్ట్ మేనేజర్ అవుతాను. అలాంటి నాకు, ఒక ఉత్తమ ఇల్లాలులాగా అన్నీ చేసి, ఉద్యోగం చెయ్యడం కుదరదు. హడావిడిగా వంటలు చెయ్యమంటే చెయ్యలేను. ఎప్పుడైనా సెలవల్లో ఓకే. ఇంట్లో అన్నీ చేసేందుకు మనిషిని పెట్టుకుంటా. తర్వాత గొడవలు రాకుండా ముందే చెప్తున్నా, ఇష్టమైన వాళ్ళే చేసుకుంటారు."

"ఏమి ఉపన్యాసం ఇచ్చావే మహాతల్లి! పెళ్ళి అన్నాక కొన్ని సర్దుబాట్లు ఉంటాయి. మొదట్లో నువ్వు సర్దుకుంటే, తర్వాత వాళ్ళు సర్దుకుంటారు. కొద్దిగా లౌక్యంగా ఉంటే చాలు. శ్రేయస్ గురించి అత్త చెప్పింది. తనకు బాగా తెలిసిన కుటుంబం. ఒక్కడే కొడుకు. వాళ్ళమ్మ మంచితనానికి మారుపేరట. తండ్రి, విజయవాడలో వ్యాపారంలో రెండుచేతులా సంపాదిస్తున్నాడు. వాళ్ళు ఆ ఊరు వదిలి రారు. మీకు ఉద్యోగాలు ఇక్కడ. అత్త పోరు, ఆడబిడ్డ పోరు లేదు. ఇంతకంటే మంచి సంబంధం ఎన్ని జన్మలెత్తినా రాదు. వాళ్ళకి నీ చదువు, ఉద్యోగం నచ్చే వస్తున్నారు. ఎక్కువ వాగక, నేను చెప్పినవాటికి తల ఊపు చాలు!" కూతురి కన్నా విసురుగా చెప్పి అక్కడనుంచి వెళ్ళిపోయింది కుసుమ.

కుసుమా, కృష్ణల ఏకైక సంతానం అపర్ణ. కృష్ణ ఇన్యూరెన్స్ కంపెనీలో ఆఫీసర్, కుసుమ గృహిణి. ఒక ఇల్లు తప్ప వేరే ఆస్తి లేదు.

అపర్ణ మాత్రం అందంలో అప్సరస, చదువులో సరస్వతి. అన్ని క్లాసుల్లోనూ ఫస్ట్. మంచి కంపెనీలో లక్షల్లో జీతం.

ఇవాళో, రేపో, ప్రమోషన్ కూడా రాబోతోంది.

నిజానికి అపర్ణని చేసుకోవడానికి, మగపిల్లలు చాలామంది తయారుగా ఉన్నారు.

ఎటొచ్చీ, అపర్ణ ఇండియా వదలడానికి ఇష్టపడటంలేదు.

"అప్పూ! నీకు ఇరవై అయిదేళ్లు వచ్చాయి. ఇంకా పెళ్లికి ఆలస్యం ఎందుకు? నువ్వు ఎవరినైనా ఇష్టపడుతుంటే చెప్పు!" కృష్ణ అడిగాడు.

పక్కనే కుసుమ ఆత్రంగా చూస్తోంది.

"లేదు నాన్నా! కాలేజ్‌లో, ఆఫీస్‌లో, చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు కానీ, ఇలా పెళ్లి చేసుకోవాలి అనుకునే వాళ్ళు తారసపడలేదు!" నిజాయితీగా తండ్రికి చెప్పింది.

"సరే! మేము తెలిసిన వాళ్ల ద్వారా ముందు చూస్తాం. కుదరకపోతే మ్యాట్రిమోనియల్‌కి వెళ్దాం. నీకు ఎలాంటి అబ్బాయి కావాలో చెప్పు!"

"చదువు, ఉద్యోగం ముఖ్యం నాన్నా! ఇప్పుడు ఉద్యోగాలలో భద్రత లేదు. అందుకే ఇద్దరికీ ఉద్యోగాలు ఉండాలి. ఒకవేళ ఒక కంపెనీలో పోయినా, వేరే చోట తెచ్చుకునే సామర్థ్యం ఉండాలి. ప్రస్తుతం నేను చేస్తున్న కంపెనీలో, జీతం, మిగిలిన ఉద్యోగులు,పని తీరు అన్నీ బావున్నాయి. అందుకే ఉద్యోగం మారదల్చుకోలేదు, వేరే దేశం వెళ్లే కోరిక నాకు లేదు. ఇక్కడ ఉన్న అబ్బాయిలనే చూడండి! ఎలానో మిగిలినవి మీరు చూసుకుంటారుగా!" ధైర్యంగా తండ్రికి చెప్పింది.

బంధువులతో సంగతి పంచుకుంటే, కృష్ణ చెల్లెలు ఈ సంబంధం గురించి చెప్పింది. ముందు జాతకాలు చూపించి, ఇద్దరివీ సాధనతారలు, జాతకాలూ బాగా కలిసాయి అన్నాక, శ్రేయస్ తండ్రి భాస్కర్‌తో మాట్లాడాడు కృష్ణ.

అపర్ణ గురించి విని చాలా సంతోషపడ్డాడు భాస్కర్. ఆ అమ్మాయి, తన కోడలిగా సరిపోతుందని ఆయనకి అనిపించింది.

పిల్లలు లేక భాస్కర్,రమ బోలెడు పూజలు, నోములు చేస్తే కొడుకు పుట్టాడు. లేకలేక పుట్టిన పిల్లవాడిని, అరచేతుల్లో పెట్టి పెంచారు.

శ్రేయస్‌కి అతి గారాబంతో బద్ధకం ఎక్కువ.

డొనేషన్ కట్టి ఇంజినీరింగ్ చదివాడు. తెలిసిన వారి కంపెనీలో ఉద్యోగం.

భాస్కరే జీతం ఇస్తున్నారని వినికిడి.

తన తర్వాత, వ్యాపారం కొడుకు చేతిలో పెడితే, మొత్తం గుండుసున్నా అవుతుందని ఆయనకి తెలుసు. అందుకే తెలివైన కోడలిని ఎన్నుకుంటే, కొడుకుని దారిలో పెడుతుందని ఆశ.

అందరూ ఒక హోటల్‌లో కలుసుకుని, పరిచయాలు చేసుకున్నారు.

అపర్ణని చూసి భాస్కర్, రమలు సంతోషపడ్డారు.

సన్నగా, పొడవుగా, చురుకైన కళ్లతో హుషారుగా ఉన్న అపర్ణ, రమకి నచ్చితే,

పెళ్ళిచూపులని అతిగా తయారవ్వకుండా, సింపుల్‌గా కుర్తా, పైజామా, చున్నీ వేసుకుని, ఎంతో మర్యాదగా అందరినీ పలకరించిన, ఆ అమ్మాయిని చూస్తే భాస్కర్‌కి హాయిగా అనిపించింది.

ఆరడుగుల పొడవు, మంచి పసిమి రంగు, బ్లూ జీన్ ప్యాంట్ మీద తెల్లటి షర్ట్ వేసుకుని చాలా అందంగా, ఒక సినిమా హీరోలా ఉన్న శ్రేయాస్‌ని చూడగానే, అపర్ణ మనసు గంతులేసింది.

కుసుమా,కృష్ణలు కూడా అబ్బాయిని చూసి 'బావున్నాడు!' అనుకున్నారు.

మాట్లాడుకోవడానికి వీలుగా ఉంటుందని, టెర్రస్ గార్డెన్‌లో ఉన్న రెస్టారెంట్‌కి దారితీసారు.

అందరూ వాళ్లకి కావాల్సినవి ఆర్డర్ చేసుకుని, నెమ్మదిగా కబుర్లు మొదలుపెట్టారు.

అపర్ణ కొంతసేపు మొహమాటంగా ఉండి, నెమ్మదిగా అతనితో మాటలు కలిపింది.

శ్రేయస్ చాలా ఆచితూచి మాట్లాడాడు.

ఇంకేదో అడగబోతున్న అపర్ణని, భాస్కర్, "నీ ఉద్యోగం టైమింగ్స్ ఎలా ఉంటాయమ్మా!

ఇప్పుడు చాలామటుకు పగలు పని అయినా, సాయంత్రం,రాత్రి కాల్స్ ఉంటాయి కదా! నీకూ అంతేనా!" అని సంభాషణ మొదలుపెట్టి, చాలా విషయాలు మాట్లాడి తృప్తిగా చూసాడు.

రమా, కుసుమా కబుర్లు చెప్పుకుంటే, కృష్ణ, శ్రేయస్‌తో మాట్లాడడానికి ప్రయత్నించాడు.

"మా వాడు కొంచెం రిజర్వుడ్ టైప్ కృష్ణ గారూ. కొద్దిగా అలవాటయితే, మీరు 'బాబోయ్ ఇంక ఆపు నీ కబుర్లు అనాల్సిందే!" నవ్వుతూ, కొడుకుని పక్కకి తీసుకెళ్లి , ఒక నిమిషం మాట్లాడి వచ్చాడు భాస్కర్.

"బావగారూ! అపర్ణ మా కోడలు. పెళ్ళి మా లెవెల్‌లో విజయవాడ చెయ్యాలంటే మీకు కష్టం, అందుకే అన్ని ఏర్పాట్లు మేము చేస్తాం. మీరు హాయిగా వచ్చి పెళ్లి చేసి వచ్చేయండి. ఖర్చులన్నీ మావి! మీరు పిల్లలకి ఏం పెట్టుకుంటానన్నా మాకు అభ్యంతరం లేదు." సింపుల్‌గా చెప్పేసారు.

"అమ్మా అపర్ణా! నాకు ఓపిక ఉన్నంతకాలం నేను వ్యాపారం చూసుకుంటా, మీరు ఉద్యోగాలు చెయ్యండి. నేను ఎప్పుడు రిటైర్ అవుదామనుకుంటే, అప్పుడు మీరు అక్కడికి వచ్చి వ్యాపారం చూసుకోవాలి. ఇదొక్కటే నా షరతు!"

అపర్ణ సిగ్గుగా శ్రేయస్ వేపు చూస్తే, శ్రేయస్ చాలా అభావంగా ఫోన్ వంక చూస్తున్నాడు. మధ్యమధ్యలో గోళ్లు కోరుకుంటూ, కాళ్ళు విపరీతంగా ఊపేస్తున్నాడు.

అపర్ణకి అతని ప్రవర్తన చాలా విడ్డూరంగా అనిపించింది.

ఇంటికి వెళ్ళేటప్పుడు తల్లిదండ్రులతో తన అనుమానం చెప్పింది.

"ఆ పిల్లాడు ఒకడే కొడుకు, గారాబంగా పెరిగాడు, అందుకే కొద్దిగా సిగ్గరి" కుసుమ అంది.

ఆమె మాటలని సమర్ధిస్తూ, "అవును మొహమాటం ఎక్కువ అనుకుంటా!" అన్నాడు కృష్ణ.

కొన్నిరోజుల తర్వాత, వేరే పెళ్లికి విజయవాడ వెళ్లిన వీరు, నిశ్చితార్థం చేసుకునే ముందు, ఒకసారి అబ్బాయి ఇంటికి వెళ్లి, అక్కడి పరిస్థితి చూద్దామని, భాస్కర్ ఇంటికి వెళ్లారు.

ఫోన్ చేసి, వస్తున్నామని చెప్పినా, అంత మనస్ఫూర్తిగా వాళ్ళు ఆహ్వానించలేదని కుసుమకి అనిపించింది. శ్రేయస్ కూడా అక్కడే ఉన్నాడు.

అందరూ ఏవో మాట్లాడుకుంటుంటే, కొంచెం దూరంలో కూర్చున్న శ్రేయస్ పక్కనే కూర్చుని, అతనితో మాటలు కలుపుదామని,

"మీ హాబీస్, ఇంట్రెస్ట్ ఏమిటి?" నెమ్మదిగా అడిగింది అపర్ణ.

"నాకేం లేవు!" ఆమె వేపైనా చూడకుండా అన్నాడు.

"అలా కాదు, ఎంత వర్క్ ఉన్నా కొన్ని డైవర్షన్స్ ఉండాలిగా! నా మటుకు నాకు సెలవల్లో మంచి సినిమానో, సంగీతం ప్రోగ్రాంకి వెళ్ళడమో..."

"నాకు ఇంట్రెస్ట్‌లు లేవని ఒకసారి చెప్పాను. నీకు అర్థం కాదా? ఎందుకు మళ్లీ మళ్లీ అడుగుతావు?" చేతిలో ఉన్న గ్లాస్ కింద విసిరేసి కోపంగా అరిచాడు.

మొహం ఎర్రబడి, చెమటలు వచ్చి, ఆవేశంగా కనిపించిన శ్రేయాస్‌ని చూస్తే అపర్ణకి భయం వేసింది.

రమ గబగబా వచ్చి, "ఏమనుకోకమ్మా! కొత్త వాళ్ళతో ఎక్కువ కలవడు, అందుకే చిరాకు. అమ్మాయిని అలా భయపెడితే ఎలారా నాన్నా!" అంటూ అతన్ని లోపలికి లాక్కెళ్లింది.

కొంచెం సేపు వరకు అపర్ణ తేరుకోలేదు. కుసుమా,కృష్ణ కూడా కంగారు పడ్డారు.

తర్వాత అక్కడున్న సమయం, అపర్ణ సంతోషంగా కంటే, ఒక సందేహం, భయంతో గడిపింది.

మధ్యలో మూఢమి ఉండడంతో, తాంబూలాల ముహూర్తం రెండు నెలల తర్వాతకి కుదిరింది.

"ఏకంగా పెళ్లి పెట్టుకుందాం బావగారూ! మళ్లీ ఇవన్నీ ఎందుకు దండగ ఖర్చు! " భాస్కర్ అడ్డు తగిలినా, "మాకూ కొన్ని సరదాలు ఉంటాయి కదా బావగారూ!" సర్దిచెప్పాడు కృష్ణ.

"అమ్మా! నేను శ్రేయస్‌తో , నిశ్చితార్థం షాపింగ్‌కి వెళ్తాను. మీరు వాళ్ల అమ్మానాన్నలతో చెప్పండి."

"తప్పకుండా వెళ్ళండి అప్పూ! మీకు కూడా, కొద్దిగా కొత్త పోయి ఫ్రీగా ఉంటారు. అతను కొద్దిగా మొహమాటస్తుడు, కాస్త కలిస్తే బావుంటుంది. నేను వాళ్ళ నాన్నగారికి చెప్తాను!" అన్నాడు కృష్ణ.

ఇద్దరికీ వీలుగా ఉండే సమయం నిర్ణయిద్దామని, అపర్ణ రెండుమూడుసార్లు అతనికి ఫోన్ చేసింది.

ఉదయం పదిగంటలకు ఫోన్ చేస్తే, నిద్రపోతుండేవాడు.

సాయంత్రం అంటే, "ఆఫీస్‌కి వెళ్తాను!" అనేవాడు.

ఫోన్‌లో కూడా చాలా ముక్తసరిగా, "ఎస్,నో!" తప్ప మాట్లాడేవాడు కాదు.

కొత్తగా పెళ్లి కుదిరిన వాళ్ళు మాట్లాడే తీపికబుర్లు, అస్సలు లేవు.

స్నేహితుల నుంచి కొన్ని విన్న అపర్ణకి, ఇతని తీరు, కొద్దిగా వింతగానూ, కొంత భయంగానూ అనిపించింది.

ఒక రోజు ఫోన్లో దొరికితే,

"ఇవాళ మనం కొన్ని డ్రస్సులు చూద్దాం. ముహూర్తానికి మనిద్దరివీ, రంగూ, డిజైన్ కలిసేటట్లు కొందాం. నేను లంచ్ టైంకి కిందకి వస్తాను. ఎక్కడైనా లంచ్ చేసి షాపింగ్ చేద్దాం. నువ్వు ఒకటిన్నరకి మా ఆఫీస్ దగ్గరికి రా!" చెప్పింది అపర్ణ.

"నాకు షాపింగ్ బోర్! సరేలే! నీకోసం వస్తాను!" అన్నాడు.

"ఉద్ధరించావు!" మనసులో అనుకుంది.

అపర్ణ చెప్పిన టైంకి బయట కారులో వెయిట్ చేస్తున్నాడు శ్రేయస్.

ఆమె సరిగ్గా బైటికి వస్తుంటే, మేనేజర్ ఏదో క్లారిఫికేషన్ కోసం పిలిచాడు.

ఒక పదినిమిషాల్లో చెప్పి బయటికి వచ్చింది.

శ్రేయస్ కారు దిగి, అక్కడ ఉన్న పేవ్మెంట్ రాళ్ళని గట్టిగా తంతున్నాడు. అతని మొహం కోపంతో ఎర్రగా అయిపోయింది.

అపర్ణని చూడగానే, "పదినిమిషాలు లేట్ చేసావు. నాకు నచ్చదు ఇలా లేట్ చేస్తే!" కఠినంగా ఉంది అతని మాట.

"సారీ! నేను వస్తుంటే..."

"ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్! ఇంకోసారి ఇలా జరిగితే ఊర్కోను!" 'చంపేస్తాను' అన్నంత గట్టిగా బెదిరించాడు.

స్పీడ్‌గా కారు డ్రైవ్ చేస్తుంటే, "స్లోగా పోనియ్యి! సిగ్నల్ జంప్ చేసావు, అంత రాష్‌గా డ్రైవ్ చెయ్యకు!" అపర్ణ కంగారుగా అంది.

సడన్‌గా బ్రేక్ వేసి కారు ఆపేసాడు.

"మా నాన్న నీతో వెళ్ళమని గట్టిగా చెప్పారని వచ్చాను. నువ్వు నోరుమూసుకుని ఉండటంలేదు, ఏదో ఒకటి వాగుతూ ఉంటావు, ఐ హేట్ ఇట్! నాకు సలహాలు చెప్తే నచ్చదు. గెట్ అవుట్!"

అయోమయంగా చూసింది అపర్ణ. 'ఏంటీ! ఇతనికి మతి సరిగ్గా లేదా, లేక తాగాడా! ఆల్కహాల్ వాసన లేదు, కొంపదీసి డ్రగ్స్ అలవాటుందా!'

కారు దిగి, "నువ్వేమన్నా డ్రగ్ అడిక్ట్‌వా! ఏంటీ అలా ప్రవర్తిస్తావు? నీ ప్రవర్తన నాకూ నచ్చలేదు..." అపర్ణ మాట వినకుండానే, తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళాక అపర్ణ మొహం చూసి, "ఏమైంది? షాపింగ్ చెయ్యలేదా?" కంగారుగా అడిగిన తల్లిని పట్టుకుని ఏడ్చేసింది.

వెక్కిళ్ళ మధ్య జరిగింది చెప్తుంటే, తండ్రి కూడా విన్నాడు.

"ఉన్నట్టుండి విపరీతమైన కోపం వస్తుంది అతనికి. చేతిలో ఏది ఉంటే అది విసిరేస్తాడు. సంతులన ప్రవర్తన అసలు లేదు. ఎప్పుడు ఫోన్ చేసినా, నిద్రపోతున్నాను అంటాడు. మాదక ద్రవ్యాల అలవాటు

ఉంటేనే అలా ప్రవర్తిస్తారు. ఇలాంటి అలవాటున్న వాళ్ళని మా ఆఫీసులో ఒకరిద్దరిని చూసాను. డ్రగ్స్ తీసుకున్నట్టు తెలిసి, వాళ్ళని ఉద్యోగంలోనుంచి తీసేసారు.

కోపం వస్తే,మనిషి కొడతాడేమో అన్నట్లు ప్రవర్తిస్తాడు శ్రేయస్.

ఏం మాట్లాడినా ఆవేశపడుతున్నాడు. పెళ్లికి ముందే ఇలా ఉంటే, పెళ్ళయ్యాక ఇంకెలా ఉంటాడో! నాకయితే చాలా భయం వేసింది అతన్ని చూస్తే ! నాకెందుకో అతనికి డ్రగ్స్ అలవాటుందని అనుమానం నాన్నా!

నేను అతన్ని పెళ్లి చేసుకోను. మీరు వాళ్ళకి చెప్పేయండి!" ఏడుస్తూ అంది అపర్ణ.

"నిశ్చితార్థం ముహూర్తం పెట్టుకుని, ఇప్పుడు వాళ్ల సంబంధం వద్దంటే ఎలా? మర్యాదగా ఉండదేమో! వేరే సంబంధాలు కూడా రావు, ఇంకోసారి మాట్లాడి చూడు!" అపర్ణకి చెప్తున్న భార్యని ఆపాడు కృష్ణమోహన్.

"లేదు! ఆ రోజే నాకు అనుమానం వచ్చింది. మన అమ్మాయి జీవితం కన్నా, మర్యాద ముఖ్యమైంది కాదు! నాకూ అతని ప్రవర్తన నచ్చలేదు. ఇలాంటివాడిని పెళ్లి చేసుకునే కన్నా పెళ్లి లేకపోవడం మేలు." స్థిరంగా అన్న తండ్రితో,

"నాన్నా ! ఈ సారి పెళ్ళి సంబంధం మాట్లాడేటప్పుడు, ముందుగా అబ్బాయి జాతకం కాదు, ఆరోగ్య పరీక్షల వివరాలు అడగండి.

ఎంతకాలం చేస్తామో తెలియని ఉద్యోగాలకే, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అయినప్పుడు, జీవితాంతం కలిసి ఉండాల్సిన పెళ్లికి, అబ్బాయి,అమ్మాయిలకి, ఆరోగ్య పరీక్షల అవసరం లేదా?

భవిష్యత్తులో, చక్కగా సంసారం చేసుకుని, సమాజానికి మంచి పిల్లల్ని అందించాలంటే, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరమైన దంపతులు అవసరం.

జాతకాలు మాత్రమే చూస్తే, పిల్లలకి ఉన్న చెడు అలవాట్లు, ఆరోగ్యపరమైన సమస్యలు తెలియవు కదా!

ఇద్దరి నక్షత్రాలు కలిసినా, హెల్త్ ప్రొఫైల్ కలవడం కూడా చాలా ముఖ్యం.

నేనూ అన్ని పరీక్షలు చేయించుకుని, నా ఆరోగ్యవివరాలు మీకు ఇస్తాను. అవతలి వాళ్ళు, అందుకు ఇష్టపడితేనే, మిగిలిన విషయాలు మాట్లాడండి.

శారీరకంగా, మానసికంగా, ఇద్దరూ పెళ్లికి అర్హులయితేనే, పెళ్లి చెయ్యాలి. ఏవో సమస్యలతో పెళ్లి చేసుకుని, మళ్లీ విడాకుల కోసం కోర్టుల చుట్టూ తిరగడం నాకిష్టం లేదు.

జాతకంలో సాధన తారలు, మిత్రతారలని చూడడం కంటే, మానసికంగా, శారీరకంగా మిత్రులయితే, ఆ కాపురం బావుంటుందని నా ఉద్దేశం." అపర్ణ మాటలకి,

కుసుమ, కృష్ణ లకు అపర్ణ కొత్తగా కనిపించింది.. "మా అమ్మాయేనా!?" అనుకున్నారు. ★★★

COMMENTS